



# మన రచయిత/త్రులు

## మద్దూరి రాజ్యశ్రీ

*'మన రచయిత/త్రులు' పేరిట శ్రీమతి రాజ్యశ్రీ ఒక్కొక్క రచయిత / రచయిత్రిని విశ్లేషిస్తూ, వాళ్ళ నవల నొకదానికి సమీక్ష రాస్తారు. శ్రీమతి రాజ్యశ్రీ ఎమెస్కో అధినేత శ్రీ యం.యన్.రావుగారి అమ్మాయి. ఆమె 200 పైగా నవలలకు ఎడిటోరియల్ వర్కు చేశారు. రీడర్స్ రిపోర్టు రాయటం, బాక్ కవరు మేటర్ రాయటం, పుస్తక ప్రపంచంలో రాబోయే నవలకు సమీక్ష రాయటం చేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు మన కౌముది ద్వారా మీ ముందుకు వస్తున్నారు.*

## 'మీరా' లక్ష్మి

"అబ్బ ఈ ప్రేమకి ఎంత శక్తి ఉంటుంది! మనసుని పారేసుకోకూడదేగాని, అది మన చేజారి పట్టు తప్పిందంటే అది ఆడించినట్లు ఆడాల్సిందే!" లక్ష్మి గారి నవలల్లో తరచూ కనిపించే తత్వమిది!

మీరా నవలతో బాగా పేరు రావడంతో లక్ష్మికి అది ఇంటి పేరయికూర్చుంది. అప్పటి నుంచి 'మీరా' లక్ష్మిగా చలామణి అవుతున్నారు. ఆవిడ కూడా స్త్రీ పరంగానే రచనలు చేశారు. కాని ఆవిడ స్త్రీ పాత్రలు అబలలు. ఎక్కువగా మధ్య తరగతి కుటుంబంలోంచి వచ్చిన వాళ్ళే. వాళ్ళ వినయవిధేయతలు, వాళ్ళ ఓరిమే వాళ్ళకి పెట్టని ఆభరణాలు.

రోహిణి నవలలో రోహిణిని గురించి ఇలా వర్ణిస్తారు.

*మనిషి చామన ఛాయ అయినా కనుముక్కు తీరు చాలా చక్కగా ఉంటుంది. దానికి తోడు చక్కని వినయవిధేయతలు, ఓరిమి కూడా అదో రకమైన హుందాతనాన్ని తెచ్చిపెడతాయి. ముఖ్యంగా విశాలమైన ఆ సోగకళ్ళు - స్నేహ పూరితమైన ఆ చల్లని నవ్వు ఎవరినైనా ఇట్టే ఆకర్షించేలా ఉంటాయి. విష్ణుమూర్తిని, మొదట ఆకర్షించింది ఆ నవ్వు, తర్వాత ఆ సోగ కళ్ళు.*

*ఆ ముఖంలో, ఆ కళ్ళలో, భావాలు తెల్లకాగితం మీద కనబడినట్టు కనబడతాయి. 'ప్రభాకర్ రాకకి ఆ ముఖంలో సంతోషం, ఆనందం, అదోరకమైన పారవశ్యం నాట్యం చేస్తోంది - పెదాలు చిందించిన మందహాసం ఎగదన్ని కనుబొమల్లో నాట్యం చేస్తోంది. సగం వాల్చిన ఆ కనురెప్పలోంచి తన్మయత్వం తొంగి చూస్తున్నట్టుగా ఉంది'*

'ప్రేమమందిరం' నవలలో విజయని చూస్తే శ్రీహరికి జాలేసింది.

*'పిల్లలకి కథలు చెప్తుతూ, చదువు చెప్తుతూ, సరదాగా ఉండి విజయ ఎవరేనా వస్తే సిగ్గుగా బిడియంగా వెళ్ళిపోవడం అతను ఎన్నోసార్లు చూశాడు. ఎక్కువ కులాలకున్న బాధలే ఇవి. తక్కువ కులాల్లో ఏ పని పడితే ఆ పని వాళ్ళ పరిస్థితులకి తగ్గట్టు ఏదో ఒక పని ధైర్యంగా చేసుకుంటారు. అలా వీళ్ళు చేసుకోలేరు. చేసుకోలేకపోతే గడవదు. అడుగడుగుకు అభిమానపడుతూ, ఆత్మాభిమానాన్ని చంపుకుంటూ జీవితాన్ని వెళ్ళమారుస్తారు.'*

విజయని చూస్తే మహాలక్ష్మమ్మగారికి చాలా ఇష్టం.

'చదువుకున పిలయినా ఆ నెమ్మది, కుదురు – తల్లి ఇలా అవస్థ పడుతోందని, చదువు మానేస్తానని తల్లికి తనకి చేతనైన సహాయం చేస్తోంటే అలా ఉండాలి ప్రేమంటే – ఎలాగయినా డబ్బు హోదా పెరుగుతోంటే ప్రేమలు తరిగిపోతాయి.'

లక్ష్మి గారివి ఎక్కువగా కుటుంబగాథా కథలు. ఉమ్మడి కుటుంబం, అందులో ఉండే సాదకబాధలు, తోడికోడళ్ళ మధ్య పొరపచ్చాలు, ఆడబడుచుల ఆరళ్ళు, అత్తగారి నిస్సహాయతో, ఆగడమో ఇలా ఉంటాయి.

క్షణం సేపు ఆగి 'జానకి' అని పిలిచింది.

'ఊ' మూలిగింది కూర్చున్న చోటనుంచే.

'ఒకసారి ఇలా వస్తావా?' కోపాన్ని అణుచుకుంటూ అంది.

'నువ్వేరా' నిర్లక్ష్యంగా అంది.

తెచ్చిపెట్టుకున్న శాంతం కాస్తా ఎగిరిపోయింది దుర్గారాణిలో.

'హాల్లో ఫ్లవర్ వాజ్ ఎందుకు తీసేసావూ?!' అని అడిగింది దుర్గారాణి.

'నాకు నచ్చింది' తలెత్తకుండానే జవాబిచ్చింది జానకి.

'నువ్వేమైనా చిన్నపిల్లవా? కొన్నప్పటి నుంచీ అది అక్కడే ఉంది. ఇప్పుడెందుకు తీసినట్టు'

'చెప్పానుగా! అది నాకు చాలా నచ్చింది.'

'నచ్చితే కొనుక్కో' ఆవేశంగా అరిచినట్లే అంది.

ఇప్పుడు పూర్తిగా దుర్గారాణి కేసి తిరిగింది జానకి. ఆ కళ్ళలో చెప్పలేనంత కసి, మొండితనం, 'నీకు మల్లే ప్రతిదీ అనుకున్న వెంటనే ఒళ్ళోకి తెచ్చే వాళ్ళుంటే నాకీ తిప్పలెందుకూ? నేనే బీదదాన్ని. నా మొగుడు బీద. నాకెలా వస్తాయి. అందుకే తెచ్చుకున్నాను' ఇంక చెప్పాల్సిందేం లేదన్నట్లు మొహం తిప్పేసుకుంది జానకి.

ఈ కుటుంబ గాధ కథలో అంతర్లీనంగానో, ప్రత్యేకంగానో ప్రేమకథ ఉంటుంది. అలా అని భారీ ఎత్తున ప్రేమ సంభాషణలు, నాయకా నాయకుల విహారాలు వగైరాలేం ఉండవు. చెప్పీ చెప్పకుండా చెపుతారు.

రవీంద్ర ఎడమ చేయి విజయకుడి చేయి మీద పడింది.

విజయ ఉలికిపడింది.

అతను విజయకేసి తిరిగి కళ్ళెత్తాడు.

ఉలికి పడ్డ విజయ సరిగ్గా అప్పుడే కళ్ళెత్తి అతని కేసి చూసింది.

మనసులోని భావాల్ని అదంపట్టి చూపించేవి కళ్ళే! అతని అభిమానం, అనురాగం, ఆప్యాయత, ఇంకా, ఇంకా తనకి ఏమైనా సరే చేయగలనన్న భావాలు ఇమిడి ఉన్నాయి.

కంగారు పడ్డ విజయ కళ్ళు వాల్చేసుకుంది.

విజయ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. కంగారువల్లో, ఓ విధమైన భయంతోనో నుదుట చెమట పట్టింది.

ఇక శైలి విషయానికొస్తే ఎక్కువగ ఎదుటి మనిషి భావాల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించటమో, దానికి అపార్థం చేసుకోవడమో ఉంటూ ఉంటుంది. మొహంలో మారే రంగురంగుల భావాల్ని ఎన్నో చోట్ల ఎన్నో రకాలుగా వర్ణిస్తారు. ఎదుటి మనిషి చూడాలని ఒకసారి, చూడకూడదని ఒకసారి, చూస్తే మారిపోయారని ఒకసారి, ఇలా అనేకరకాలుగా.

*ప్రభాకర్ కనుబొమలెత్తి రోహిణినే చూస్తున్నాడు. అతని ప్రవర్తనకి మనసు ఎంతో మూగపోయినట్లు ఉన్నా తొలిసారి తల్లి నవబోతున్నాననే ఆనందం, అదో రకమైన సిగ్గు ప్రభాకర్ కేసి చూడగానే ఆ కళ్ళలో చిందులేసినాయి. బుగ్గల్లో ఎరుపు చోటుచేసుకుంది. ప్రభాకర్ కళ్ళలో చిరాకు, కనుబొమ్మల్లో ప్రశ్నార్థకం అతనికేసి చూడగానే కలిగిన ఆనందం ఊదేసినట్లు ఎగిరిపోయింది.*

*'ఏమిటిది? ఏమైంది ' ఎంత ఆలోచించినా ఆమెకి అర్థం కాలేదు.*

*'తల ఎత్తేసరికి ఉన్న ఆనందం, తనకేసి చూసేసరికి రోహిణి ముఖంలో ఆనందం ఊదేసినట్లు మాయమవడంతో ప్రభాకర్‌కు క్లూ ఏదో దొరికినట్లయింది. ప్రశ్నార్థకంగా పైకి లేచిన కనుబొమ్మలు బరువుగా, భారంగా యథాస్థానానికి వచ్చాయి. '*

## నవల - మీరా, రచయిత్రి - లక్ష్మి

మనిషి జీవితంలో మంచి చెడ్డలు నిర్ణయించడానికి రోజులే అఖ్ఖరలేదు.

క్షణాలు, ఘడియలే చాలు. వాటికంత విలువ ఉంది మరి.

ముందేం జరుగుతుందో లీలామాత్రంగా ఏ మాత్రం తెలిసినా మానవుడు జాగ్రత్తపడతాడు. కనీసం తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు.

నిజానికి కొన్ని కొన్ని అస్సలు తెలియవు. అదృష్ట ఘడియలు మన ముందు నిలుచున్నా గుర్తించం. వాటి టైముపోయి నిరాసక్తంగా వెళ్ళిపోతాయి. దుష్టఘడియలో మనం తీసుకున్న నిర్ణయం, భూతంలా మారి మన సహనాన్ని అంతు చూస్తుంది.

మయసభలో నీళ్ళలో పడ్డ దుర్యోధనుని చూసి, ద్రౌపది నవ్వకపోయి ఉంటే, అది దుర్యోధనుడు చూడకపోయి ఉంటే మహాభారతమే లేదు. అలాగే శేఖరానికి సుస్వాగతం బోర్డు పట్టుకోకపోయుంటే మీరా నవలే లేదు. కాకపోతే శేఖరం దుర్యోధనుడిలాంటి వాడు కాదు. స్వతహాగ మంచివాడే

మీరాని మాయచేసి వంటరిగా పిలిపించిన శేఖరానికి, మీరా నిస్సహాయంగా కూర్చుంటే జాలేసింది. మీరా దగ్గరగా వెళ్ళి, 'నిన్ను పిలిపించడంలో నా కెలాంటి దురుద్దేశం లేదు. వెళ్ళిపో' అని వీధి గేటు వరకూ దిగబెట్టి రావాలనిపించింది శేఖరానికి. మళ్ళీ అంతలోనే, 'ఆ! ఇంతా పిలిపించి అలా వదిలేయటమే! పెద్దగా కాకపోయినా చిన్న వార్నింగివ్వాలి. కాస్త ఏడిపించి వదిలితే ఎప్పటికీ గుర్తుంటుంద'నే చిలిపి ఊహ కూడా కలగక పోలేదు.

ముందు మీరా వచ్చినప్పుడు కళ్ళలో ప్రతీకార వాంఛ మెరుస్తోంటే కసితో కూడిన చిరునవ్వు పెదాల మీద నాట్యం చేస్తోంటే 'సుస్వాగతం' అని ఉన్న రంగురంగుల అందమైన బోర్డు చేత్తో పట్టుకుని అందంగా, ఠీవిగా గుమ్మం దగ్గర నిలబడ్డాడు శేఖరం.

మీరా తేరుకోవడానికి రెండూ, మూడు క్షణాలు పట్టింది.

మీరా చప్పున వచ్చి తలుపు మూయబోతుంటే బూటూకాలు అడ్డుపెట్టి, 'సుస్వాగతం పలికితే ఎవరైనా అంతకోపం తెచ్చుకుంటారా!' అంటూ లోపలికి బలవంతంగా వచ్చేశాడు.

మీరా శేఖరాన్ని తప్పించుకుని విసురుగా వెళ్ళబోయింది.

శేఖరం మీరా చేయి పట్టి వెళ్ళకుండా ఆపేశాడు.

మీరా రెండో చేయి ఎత్తబోయింది.

అది ముందే ఊహించి శేఖరం రెండో చేయిని కూడా బంధించేశాడు.

'ఛీ! సిగ్గులేదు!' కస్సుమంది మీరా

'సిగ్గా!' శేఖరం తమాషాగా నవ్వుతూ అన్నాడు. 'సిగ్గా! అదంటే నాకు చచ్చే భయం.దాని జోలికి పోను. నా ఛాయలకి దానిని రానీయను. అయినా ఆడపిల్లలకే లేని సిగ్గు నాకెందుకూ?'

'తప్పించుకు పారిపోవాలని చూశావా? జాగ్రత్త! ఇంట్లో ఎవరూ లేరు - ఏ అర్థరాత్రికో గానీ రారు. నేను నీతో మాట్లాడాలి - బుద్ధిగా కూచో' అని బెదిరించడమైతే బెదిరించాడు కాని ఏదో తీవ్రంగా వాదించి, వాదించి అలసిపోయిన దానిలా కూర్చున్నట్టుగా ఉన్న మీరాని చూస్తే జాలేసింది. ఎంతయినా ఆడపిల్ల, ఆడపిల్లే అనుకున్నాడు.

కాని మనసు కోతి అని ఊరికే అనలేదు. కాస్త ఏడిపించాలన్న చిలిపి ఊహ ఇద్దరి జీవితాలకి ఎంత శాపమవుతుందో ఆ క్షణంలో అతనికి తెలియలేదు.

నెమ్మదిగా వచ్చి మీరా పక్కన కూర్చొని 'నీకు చిన్న బహుమానం ఇవ్వాలని ఉంది. ఈ సిగరెట్ ఎప్పుడూ గుర్తుండేటట్టుగా ముంజేతి మీదివ్వనా - లేక అద్దంలో చూసుకోగానే ముచ్చటగా కనిపించేటట్టు ఈ బుగ్గమీదివ్వనా - లేక అద్దంలో చూసుకోగానే ముచ్చటగా కనిపించేటట్టు ఈ బుగ్గ మీదివ్వనా!' అన్నాడు. 'పైగా ఏం చెయ్యను? ఈ వాచీ నీకు బాగుండదు. ఈ ఉంగరం నీకు లూజవుతుంది. ఇంతకన్నా నా దగ్గరేం లేదు' అన్నాడు.

అతని తిక్క ప్రవర్తనకి మీరా సహనం చచ్చిపోయింది. తను లేవబోతే అతను లేవనీయలేదు. 'మర్యాదగా లేవనీ లేకపోతే నేనెవరో నీకు తెలుస్తుంది' రోషంగా అంటూ అతన్ని పిచ్చి బలంతో తోసి నిలబడింది.

'నేనెందుకు భయపడాలి మీకు, మీరంటే ఏమిటో అంతా జ్యోతి చెప్పింది నాకు, అవన్నీ నేను అరుణకి చెపుతానని, ఇంట్లో అందరికీ తెలుస్తాయని మీ భయం. అందుకే నా నోరు కట్టివేయాలనీ, నన్ను రానీయకుండా చేయాలనీ చూస్తున్నారు' మీరా మాటలు పూర్తికాకుండానే శేఖరం చాలా నేర్పుగా మీరా చేయిని అందిపుచ్చుకున్నాడు.

అతన్నుండీ పట్టు తప్పించుకోవటానికి అతను కెవ్వుమనేంత గట్టిగా ముంజేతి మీద బలంగా కరిచింది.

వెంటనే మీరా చేయి అదిలేశాడు. అతని ముఖం కఠినంగా మారింది.

ఎలాగయినా అతన్నుండి తప్పించుకోవాలని మీరా, మీరాని ఎలాగయినా వదలకూడదని శేఖరం.

ఇద్దరూ చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

'చెప్పు! నిజం చెప్పు. నేనంటే ఏమని చెప్పింది జ్యోతి?'

'ఆవిడ్నే అడగండి'

'ఇప్పుడన్నావుగా ఏదో చెప్పిందని'

టప్ టప్ మని వరసగా వచ్చి ఒక్కో పుస్తకమే అతని మీద వర్షంలా వచ్చి పడసాగాయి.

చివరగా మీరా చేతిలో పేపర్ వెయిట్ మిగిలింది.

'నన్ను వెళ్ళనీయకపోతే దీనితో నీ తల పగులుతుంది అడ్డులే' పిచ్చిదానిలా అరిచింది మీరా

అతనూ చాలా ఆవేశంలోనే ఉన్నాడు. అలాంటి మనిషి ఆ దెబ్బకి భయపడి లొంగుతాడా?

అతను మెరపులా మీరా దగ్గరకి రెండంగల్లో వచ్చాడు. మీరా చప్పున ఆ పేపర్ వెయిట్ని విసురుగా అతనికేసి కొట్టింది.

శేఖరం నుదిటికి కుడి పగ్గ తగిలి కిందపడి ముక్కలయింది. ఎడమ చేత్తో మీరా చెయ్యిని గట్టిగా పట్టుకుని కుడిచేత్తో నుదురు రాసుకున్నాడు. చేతికి వెచ్చగా తడిగా తగిలించి.

చేయిచూసుకున్నాడు రక్తం.

ఆ నెత్తురు చేయి మీరా నుదిటికి అద్దేడు శేఖరం.

మీరా ఎంత గింజుకున్నా తప్పించుకోవటానికి వీలు లేని విధంగా బంధించేశాడు.

మీరా నుదుట అద్దిన రక్తం అమ్మవారి బొట్టులా కనిపిస్తోంది.

'ఇపుడు? న్యూసెన్సు కేసు పెడతావా - పరువు నష్టం దావా వేస్తా?'

'మీలాంటి మూర్ఖులకి బలం ఉంటే - పశువు -'

ఆపైన మీరాని మాట్లాడనీయకుండా తన పెదాలతో మూసేశాడు శేఖరం.

శేఖరంలో కలిగిన ఉద్వేగం, వివేకాన్ని ఒక తోపు తోసినట్లు పక్కకి నెట్టింది.

గదిలో పరుచుకున్న వెలుతురు శాంతిని కోల్పోయినట్లు వెలవెలబోయింది.

బయట నుంచి దూసుకొస్తున్న గాలి స్థంభించినట్లు ఆగిపోయింది.

కాంతిని కోల్పోయిన వెలుతురు - చీకటిని చిందేస్తే, స్థంభించిన గాలి ఊపిరి ఆడనీయకుండా ఉక్కిరి బిక్కిరి చేసింది.

ఉద్రేకం వివేకాన్ని గెంటేస్తే - అంతరాత్మ మంచి చెడుల విచక్షణ జ్ఞానాన్ని కోల్పోయినట్లు - పశుత్వాన్ని జయించేలా చేసింది.

మీరా అంతర్ధానమయింది. జరగవలసిన అనర్థం జరిగిపోయాక తను మీరానెంత అపార్థం చేసుకున్నాడో తెలుసుకున్నాడు, చెల్లెలు అరుణ ద్వారా. జ్యోతి అనే అమ్మాయి తన స్నేహితులతో కలిసి శేఖరంను ఒకసారి ఫూల్‌ని చేసింది. తనకి కడుపు నొప్పి వచ్చినట్లు, నడవ లేనట్లు నటిస్తే తప్పని సరి పరిస్థితిలో ఆమెని పొదవి పట్టుకున్నట్లుగా పట్టుకుని నడిపించుకు వచ్చాడు శేఖరం కుట్టు సెంటర్‌కి. అక్కడ గుంపుగా అమ్మాయిలు కిలకిలలాడుతూ ఉన్నారు. వాళ్ళ మధ్యలో 'సుస్వాగతం' బోర్డు పట్టుకుని మీరా.... శేఖరంకి జ్యోతి మీద కన్నా మీరా మీద కసి పెరిగింది. దీనికి తోడు చెల్లెలు అరుణకి మీరా అంటే ప్రాణం. అది ఇంకా కారం రాసుకున్నట్లు ఉంది. కాని అరుణ చెప్పింది. 'మీరాకి వాళ్ళతో అంత స్నేహం లేదు. అనుకోకుండా ఆ రోజు అక్కడుంది' అంతేకాదు మీరాకి జ్యోతి అంటే అసలు ఇష్టం లేదు. వాళ్ళింటికి వెళదామన్నా తను ఇష్టపడలేదు.' అనేసరికి పిడుగు పడ్డట్టుగా చూస్తాడు.

ఒక్కసారి మీరా కనిపిస్తే బాగుండును. తను ఎప్పుడూ ఏ విషయంలోనూ పొరపాటు పడలేదు, తొందరపడలేదు. కానీ మీరా విషయలో తను పొరపాటు పడ్డాడు, తొందరపడ్డాడు. అప్పటినుంచీ పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు.

ఇటు మీరా అంతర్ధానమయి, పోయి పోయి అతని తల్లి దగ్గర వంటమనిషిగా చేరుతుంది, అతని ఊళ్ళో! శాంతమ్మగారికి మీరా, మీరాకి శాంతమ్మగారు బాగా నచ్చేశారు. 'నువ్వు చాలా పనిమంతురాలివట! ఈ కాలంలో పుట్టవలసిన దానివి కాదట' అని అక్కడ చేర్చిన జానకి చెప్పింది. మీరా కూడా 'జానకి చెప్పింది అక్షరాలా నిజం! కన్నతల్లికన్నా అభిమానంగా, ఆప్యాయంగా మాట్లాడుతుందావిడ. ఈ ఊళ్ళో ఇంతకన్నా మంచి ఉద్యోగం దొరకదు. నిజంగా ఈ పరిస్థితుల్లో ఇది నా అదృష్టమే!' అనుకుంది.

కాని ఆ అదృష్టం ఎన్నాళ్ళో నిలవలేదు. శేఖరం ఆవిడ కొడుకుగా కనబడేసరికి మీరా పరిస్థితి వర్ణనాతీతం.

హాలూ, హాల్లో ప్రతివస్తువు కళ్ళముందు గిర్రున తిరగసాగాయి వణికే కాళ్ళతో - ఆపుకోలేని దుఃఖంతో ఎలాగో వంటగదిలోకి వచ్చిపడింది. స్టౌమీద అన్నం కళపెళా ఉడుకుతోంది - మీరా హృదయంలా.

'ఛీ! తనిన్నాళ్ళు ఇక్కడా పనిచేస్తోంది! ఛీ! ఛీ ఇంత దౌర్భాగ్యం ఏ ఆడపిల్లకూ వద్దు భగవాన్!' మీరా ఎంత నిగ్రహించుకుందామన్నా దుఃఖం ఆగడం లేదు. 'తనేం పాపం చేసింది! తను స్వాభిమానం చంపుకుని, అసలా ఊహే తలపుకి రాకుండా ఉండాలనుకుని మసలుతోంటే - ఈ ఇల్లే అవాలా? ఇంతకన్నా తక్కువ కులం వాళ్ళయినా సరే వాళ్ళింట్లో గిన్నెలు తోముకున్నా తనకింత

బాధ లేకపోను. ఛీ! ఛీ! మీరా తన నూరేళ్ళ జీవితం మైలపడిపోయిన రోజు కూడా ఇంత వ్యధ చెందలేదేమో! అసలలా ఆ ఇంట్లో నిలబడాలంటే కంపరంగా ఉంది'

ఒక్కక్షణం అక్కడి నుంచి పారిపోవాలనిపించింది. కానీ ఇదేమీ తెలియని శాంతమ్మ శేఖరానికి వడ్డించడానికి మీరాని పిలిచింది.

మీరా కూర తీసుకొచ్చింది. మీరా శేఖరానికి వేయబోయింది. అతను 'వద్దు' అన్నట్లు చెయ్యి అడ్డం పెట్టేశాడు.

శేఖరం గుండెల్లో చిత్రమైన స్పందన.

మీరా గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయి.

శేఖరం చెయ్యి అడ్డుపెట్టేసరికి శాంతమ్మగారు 'కొంచెం వేసుకో చినబాబూ! ఏమిటా తినటం, కొంచెం వెయ్యి మీరా'

'ఊహూ వద్దమ్మా!' అన్నాడు గ్లాసెత్తి నీళ్ళు తాగుతూ.

వద్దనంతా అలాగే జరిగింది. శాంతమ్మగారు మీరాని కొంచెం వేయమనడం శేఖరం 'వద్దు' అన్నట్లు చేయి అడ్డుపెట్టడం.

ఈ పరిస్థితి తట్టుకోలేక అక్కడ పనిమానేద్దామంటే శాంతమ్మగారు ఒప్పుకోలేదు. 'ఇంట్లో ఏ కూతురో, కోడలో - నాకు ఒంట్లో బాగుండక పోతే ఆదరంగా చేసి పెట్టినట్లు చేస్తున్నావు. నువ్వు ఎవరూ అని ఎవరైనా అడిగితే నేనేమని చెపుతావో తెలుసా? మాకు తెలిసిన వాళ్ళమ్మాయి అని చెపుతున్నాను. నువ్వసలు పరాయి పిల్లగా నాకెప్పుడూ అనిపించలేదు మీరా!నువ్వలా కలిసి పోయావు' అంది. ఇంక ఆవిడ్ని ఒప్పించడం తన వల్ల కాదని తెలిసిపోయింది. అక్కడ్నుంచీ మీరా పాట్లు మొదలయ్యాయి. గంభీరంగా ఉండే ఈ మీరాని చూస్తే - ఆ రోజులలో మీరా అన్ని తమాషా కబుర్లు చెప్పి నవ్వించేదంటే ఎవరూ నమ్మరు.

అప్పటికీ శేఖరం మృదువుగా మీరాకి చెప్పాడు. 'మీరా' అని మృదువుగా పిలిచినా మీరాలో చలనం లేదు. 'మీరా, మాట్లాడదలచుకోలేదా? పోనీ! మాట్లాడకపోతే, నేను చెప్పింది విను. నా గురించి నువ్విక్కడ మానేయక్కరలేదు నాలుగురోజుల పాటు ఉండిపోయేవాడిని - అమ్మని చూడ్డానికి వచ్చినా నాలుగయిదు రోజులకంటే ఉండను.'

ఒకరోజు అతను 'నాకు టీ కావాలి' అంటే మీరాకి రోషం, బాధ కలిగినా, 'తను ఈ ఇంట్లో పనిమనిషి, వాళ్ళేం చెప్పినా చేయాలి' మనసుని సరిపెట్టుకుంది. మీరాలో ఈ భావం అది వరకెప్పుడూ కలిగేది కాదు. మొట్టమొదటిరోజు మాత్రం కాస్త మదన పడింది. సంకోచపడింది. మళ్ళా ఆ భావం మీరా దరిదాపుల్లోకి రాలేదు. దానికి కారణం శాంతమ్మగారి ఆదరాభిమానాలే!

శేఖరం వచ్చినప్పటి నుంచీ - అతని కోసం ఏదైనా చేసేటప్పుడు, స్వయంగా తన చేతులతో అతనికి వడ్డిస్తున్నప్పుడు ఆ భావం కస్సుమని లేస్తుంది.

అరుణ మీరాని అక్కడ ఆ పరిస్థితుల్లో చూసి జాలిపడింది. కాని మీరానే సర్దిచెప్పింది అరుణ, 'అన్నయ మీద కోపం పోయిది. డబ్బులేక ఇలాంటి పరిస్తితికి వచ్చిమి కానీ, మీరాకి ఏం లోటూ! అన్నయకి ఇష్టం అయితే అమ్మా ఏం అనదు. కానీ అరుణకే అన్నయ్యంటే సదభిప్రాయం లేదు. అలాంటిది అన్నయ్య దగర కదపటం బాగుండదు' అనుకుంది.

మీరాకి ఎందుకు సదభిప్రాయం లేదో అరుణకి తెలియదు. శేఖరం ఎలా పశ్చాత్తాప పడూతున్నాడో, తననా పరిస్థితిలో చూసి ఎలా కుమిలిపోతున్నాడో మీరాకి తెలియదు. అరుణ శేఖరంలో గ్రహించిన మార్పు మీరా గ్రహించలేకపోయిది. అందుకే మీరా చేతిలో బాబుని చూసి ఎవరని అడిగినా చెప్పలేదు.

'బాబు అమా, నాన్నా లేరా? వాళ్ళ దగ్గరుండడా? ఇంత ఇది కంగారు పడడం గానీ, సూటిగా ఏదైనా అడగటానికి సంకోచపడడం కాని ఎప్పుడూ, ఎరగడతను.

'ఉండకుండా ఎలా?' చాలా పెడసరంగా అంది.

'అదే - కలిసి ఉండరా?'

'నింగీ, నేలా - ఎలా కలిసి ఉంటాయి...'

శేఖరం చప్పున మీరా చేయి పట్టుకున్నాడు. ఎంత డొంక తిరుగుడుగా మాట్లాడినా మీరా చెప్పింది అర్థమవటమే కాకుండా మీరా అభిప్రాయం కూడా అతనికి అర్థమవయింది. అతని మనసు గిలగిలలాడింది.

మీరా శేఖరం చేతిని విదిల్చికొట్టింది.కాని శేఖరం వదల్లేదు.

'మీరా! నా మాట శాంతంగా విను. ముందు నువ్వు కార్లో కూర్చో! నా వల్ల జరిగిన పొరపాటుకి నేనెంత వ్యథ చెందుతున్నానో నీకు తెలియదు మీరా! నేను వచ్చి మీ అమ్మగారితో మాట్లాడతాను. నా వల్ల జరిగిన అపరాధం ఆవిడతో చెప్పి ఆవిడను ఒప్పిస్తాను.'

అతని మాటలు పూర్తికాకుండానే, మీరా, 'మా ఇంటికొచ్చి మా అమ్మతో చెప్పాలని చూశారంటే ఒకటి కాదు - మూడు శవాలని చూస్తారు' అని వెళ్ళిపోయింది.

స్టీరింగు మీద చేతులాన్చి - వాటి మీద తల ఆన్చుకున్నాడు. మీరాకి తనంటే చాలా అసహ్యం... 'ఓ మీరా! అనుకోకుండా ఆవేశంలో నా వల్ల జరిగిన పొరపాటును మళ్ళీ దిద్దుకునే అవకాశం కూడా లేదా? ఆ రోజు నీ నోరు కట్టేయాలని చూస్తున్నానన్నావు. ఈ రోజు నిజంగా నా నోరు కట్టేశావు, ఇంక నేనెటువంటి ప్రయత్నాలూ చేయటానికి వీలు లేని విధంగా నా నోరు కట్టేశావు.'

ఒకసారి అరుణ కూతురుకి తీసుకుంటూ బాబుకి కూడా చిన్న గొలుసు తీసుకుని మీరా కివ్వబోయాడు.

'మీ ఇంట్లో వంట మనిషిగా జేరినా ఇంకా మీ కక్ష తీరనట్టుంది. మీ నగలకీ, మీకూ వేయి నమస్కారాలు, మమ్మల్నిలాగయినా బ్రతకనీయండి' అని దూకుడుగా వెళ్ళిపోయింది.

నిర్విణ్ణుడయినట్టుగా నిలబడిపోయాడూ శేఖరం.

'హా!కక్షా! మీరా అంటే - బాబు అంటే తనకి కక్షా! కక్షతో నేనా, తనింత ఆవేదన చెందుతున్నది? ఒక తప్పుకి ఇంత శిక్ష! స్త్రీ కరుణామూర్తి అంటారే క్షమా హృదయురాలంటారే! ఓ! మీరా! మొదటినుంచీ నన్నేదో విధంగా బాధిస్తూనే ఉన్నావు. ఆఖరికి దోషిగా నను నిలబెట్టావు.

ఇంతకీ మీరా ఎవరో కాదు. వాళ్ళ అమ్మ ఫ్లాష్ బ్యాక్ స్టోరీ కట్ చేస్తే స్వయంగా శేఖరం మామయ కూతురే అయినా మీరా మనస్సు కరగదు.

'ఆడదాని వ్యక్తిత్వం ఇంత బలహీనం కాబట్టే మొగాడు అలా ఆడిస్తున్నాడు. ఏదో తమ జాతికి అన్యాయం జరిగిపోతోందని ఏడవటం ఎందుకూ? వాళ్ళలా ఏడ్చినన్నాళ్ళూ వీళ్ళలా ఆడిస్తూనే ఉంటారు' అనుకుంటుంది తన తల్లి గురించి.

అందుకే శేఖరం మాట్లాడదామని వచ్చినపుడు 'మా అమ్మలా తెలివి తకువదాన్ని కాదు. ఎప్పుడో మెడలో పసుపుతాడు కట్టించుకున్న నేరానికి ఆవిడ వెడితే వెళుతుంది - అదినాకు అనవసరం అంటుంది.

ఇంక లాభం లేదని గ్రహించుకున్న శేఖరం వివరంగా ఉత్తరం రాసి మీరా చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. మీరా మనస్సు మార్చుకుని వెళ్ళకపోతే అతను దూరంగా వెళ్ళిపోయే ఏర్పాట్లు చేసుకున్నాడు. అందులో జ్యోతి అంటే తనకి ఎందుకు ఇష్టం లేదో వర్ణిస్తూ, జ్యోతి స్నేహితురాలైన మీరా నుంచి అరుణని ఎలా విడదీయాలనుకుంటాడో చెపుతాడు. 'మొదట్లో నువ్వంటే కోపంగా ఉన్నా ఆ తర్వాత అంత క్రితంలా నీ మాటలు వింటోంటే నాకు కోపం వచ్చేది కాదు. విసుగా అనిపించేది కాదు.'

ఆ రోజు తనని పిలిపించన సంఘటన చెపుతూ 'మీరా' అప్పుడు నిన్నలా రప్పించడంలో నాకెటువంటి దురుద్దేశం లేదు. ప్రమాణ పూర్తిగా చెపుతున్నాను. అరుణ స్నేహం మానేయమని, ఇంకెప్పుడూ ఇక్కడికి రావద్దని చెప్పడానికే రప్పించాను. నిస్సహాయంగా కూర్చున నిన్ను చూసి చాలా జాలేసింది. ఎంతయినా ఆడపిల్లే అనిపించింది. ఏ శనిదేవత నా నాలుక మీద నాట్యం చేస్తోందో నన్ను

మాట్లాడనివ్వలేదు. ఎన్నటికీ మర్చిపోని విధంగా నీకు వార్నింగివ్వాలనుకున్నాను. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగిపోయింది. నేను పశువులా ప్రవర్తించేను' -

తర్వాత మీరా కనపడక ఎలా అల్లాడిపోయాడో, ఇంటికి మీరా కబురు తెలుస్తుందని ఎలా ఆశగా వచ్చేవాడో, జ్యోతి ఎలా వ్యంగ్యంగా అందో, అతను రకరకాల భయాలతో ఎలా క్రుంగిపోయాడో, బయట ఎలా వెతికాడో, జ్యోతి అతన్ని పెళ్ళి చేసుకుందామని ఎలా కుట్ర పన్నిందో అన్నీ వివరించాడు. జ్యోతి వాళ్ళమ్మ అతన్ని మళ్ళీ కదిపితే, 'ఇద్దరు భార్యలుండడం చట్టరీత్యా నేరం కదండీ' అన్నాడు. 'నీకు పెళ్ళయిందా' అంటే ' ఆ ఒక బాబు కూడా' అన్నాడు. అది మీరా వింటుందని, అది విని తన మీద అపోహ పోతుందని ఆశపడ్డాడు.

'మీరా! మొదటినుండీ జరిగినదంతా వివరంగా ఇందులో రాశాను. మొదట నీ మీద నాకెలా కోపం ఉండేదో కూడా దాచకుండా రాశాను. నీకు ఇష్టమయితే - నువ్వు 'ఊ' అంటే సంతోషగా నిండు మనసుతో ఈ చివరి నుంచి చేతులు చాచి అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. తప్పు చేసింది నేను - శిక్ష నేనే అనుభవించాలి.

మీరా! నన్ను క్షమించగలిగితే రేపురా! బాబు ఈ ఇంట్లో తిరుగాడుతుంటే చూడాలనే కోరికని చంపుకోలేకుండా ఉన్నాను. నేను వెళ్ళేలోగా నీకో ముఖ్యమైన సంగతి చెప్పాలి' అని రాశాడు.

ఆ రాత్రి మీరాకి నిద్రన్నమాట లేదు.

పలు రకాలుగా ఆలోచించింది.

అంతరాత్మకి, మనస్సుకి ఘర్షణ జరిగింది.

ఎప్పుడూ అంతరాత్మదే పైచేయి. అదే గెలిచింది.

అతను కోరినట్టు మీరా ఆ ఇంటికి వచ్చింది. బాబుని, తల్లిని తీసుకుని - మీరా మారిన మనస్సు శేఖరం గుర్తించలేదు. బాబు పేర ఆస్తి రాశానని, తన స్నేహితుడుని గార్డియన్‌గా ఉంచాననీ చెప్పాడు. ఒకళ్ళు చెప్పింది ఇంకోళ్ళు అపార్థం చేసుకున్నారు.

'అయ్యో! నా బాధ, ఇతనికి ఎలా చెపితే, అతను నమ్ముతాడు. ఎలా చెపితే అతనికి కోపం రాదు?'

మీరా గోడవైపు ముఖం తిప్పేసుకుంది.... ఎంత ఆపుకుందామన్నా మీరాకి దుఃఖం ఆగట్లేదు...! నాకు తెలుసు మీరు నా మీద కోపంతో వెళ్ళిపోతున్నారు.' అని మీరా కళ్ళలోకే సూటిగా చూస్తున్నాడు.

ఆ కళ్ళు తనని మోసం చేయలేవు. ఇన్నాళ్ళూ తనంటే మొదటినుంచీ మొదట్లో తనంటే ఎంత నిర్లక్ష్యమో ఆ కళ్ళే ప్రకటించాయి, తర్వాత ఎంత అసహ్యమో కూడా ఆ కళ్ళే ప్రకటించాయి, తర్వాత తనంటే ఎంత అసహ్యమో కూడా ఆ కళ్ళే అనుక్షణం వ్యక్తం చేసేవి.

అలా సూటిగా తన్ని దూసుకుపోయే ఆ చూపులకిక  నిలదొక్కుకోలేని మీరా, ఒక్కంగలో అతన్ని చేరి - అతని హృదయంమీద తల ఆన్చి ఏడ్చేసింది.

'నన్ను వదిలి మీరెక్కడికి వెళ్ళొద్దు. ఆ కవరు చదివినప్పటి నుంచి నేనెంత నరకం అనుభవించేనో మీకు తెలియదు' అంది.

'న్యాయ, ధర్మం నాలుగు పాదాల మీద నడిచినట్లు మన ఇద్దరి అదృష్టం నాలుగు పాదాల మీద నిలిచిన మన ఇద్దర్నీ ఒక దగ్గరికిక చేర్చింది.. 'పొడిపొడిగా ఉన్న మీరా జుట్టులోకి వేళ్ళు దూర్చి నిమురుతూ మీరా పాపటి మధ్య గడ్డం ఆన్చి కళ్ళు మూసుకున్నాడు శేఖరం.

తనదీ అనుకున్న ఈ బంగారు క్షణం - కదిలితే ఎక్కడ కలలా చెదిరిపోతుందో అన్నంత భయంగా అతన్ని లతలా అల్లుకుపోయి 'ఇంక నాకేం భయంలేదు' అన్న నిశ్చింతతో అతని గుడిలాంటి గుండెలమీద తల ఆన్చి నిశ్చింతగా కళ్ళు మూసుకుంది మీరా. ***